క్లుప్తంగా

మందిర నిర్మాణానికి విరాళం



రుద్రూర్: మండల కేంద్రంలో శ్రీ రామమందిర పునర్నిర్మాణానికి సోమవారం స్థానిక యువకుడు మొహమ్మద్ ఇమ్రాన్ రూ.18 వేల విరాళం అందచేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయం పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. మందిర నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్న సమయంలో అప్పటి స్పీకర్, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రూ.40 లక్షలు మంజూరు చేశారు. పనులు కొనసాగుతున్నాయి. మందిర నిర్మాణానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న దాతలకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఆలూర్ యువకుడికి డాక్టరేట్



కల్లెం సుశాంత్

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కల్లెం సుశాంత్ అగ్రికల్చర్ విభాగంలో డాక్టరేట్‌కు అర్హత సాధించారు. సుశాంత్, హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించాడు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్ చెందిన సీనియర్ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ పర్యవేక్షణలో 'ఎఫెక్టివ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్ ఏ రిజర్వాయర్ రెగ్యులేటెడ్ రివర్ బేసిన్' అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధన సిద్ధాంతాలు పరిశీలించిన ప్రొఫెసర్లు సోమవారం సుశాంత్‌ను డాక్టరేట్‌కు అర్హునిగా ప్రకటించారు. త్వరలో నిర్వహించనున్న స్నాతకోత్సవంలో సుశాంత్ డాక్టరేట్ అందుకోనున్నట్లు వెల్లడించారు. అలాగే ఇటీవల విడుదలైన టీఎస్‌పీఎస్‌సీ ఫలితాల్లో సుశాంత్ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ కొలువుకు ఎంపికైనట్లు తెలిపారు. సుశాంత్‌కు డాక్టరేట్ లభించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



వర్ని: మండలంలోని అంతాపూర్, పొట్టిగుట్ట గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నడుస్తున్న అభివృద్ధి పనులను వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ సోమవారం పరిశీలించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతతో చేసే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ రోడ్లు, నర్సరీని ఎంపీడీవో పరిశీలించారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల వితరణ




వేల్పూర్: వేల్పూర్ మండలం అమీనాపూర్ యూపీఎస్‌లో విద్యార్థులకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి యువసేన సభ్యులు సోమవారం నోట్‌బుక్కులు, పెన్నులు వితరణ చేశారు. గతంలో ప్రశాంత్‌రెడ్డిని కలవడానికి వచ్చే ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు నోట్‌బుక్‌లు తీసుకువచ్చేవారు. దాంతో వాటిని 70 మంది విద్యార్థులకు అందజేశారు. యువసేన సభ్యులు రేగుల్ల రాములు, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఉప్లూర్ పాఠశాల విద్యార్థులకు..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానికుడు పోతు అర్జున్ తన తండ్రి పోతు రాజేశ్వర్ స్మారకార్థం నోటు పుస్తకాలను వితరణ చేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థులకు నోటు పుస్తకాలను ఎంఈవో ఆంధ్రయ్య చేతుల మీదుగా అందజేశారు. హెచ్ఎం దేవన్న, ఎంపీటీసీ అనిల్ పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. కార్యక్రమానికి క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్వీ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌కు సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. అలాగే సౌండ్ సిస్టమ్‌కు దాతగా వ్యవహరించిన లింబాద్రి గౌడ్‌కు క్లబ్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. క్లబ్ కార్యదర్శి పట్వారి తులసి కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్కార్ రావు, ప్రవీణ్ పవార్, గోనె దామోదర్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

- బాల్కొండ మండల కేంద్రంలో అంతర్గత రోడ్ల పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రోడ్డుపై గుంతల్లో నిండిన వర్షపు నీరు

బాల్కొండ: మండల కేంద్రంలో అంతర్గత రోడ్లు చినుకు పడితే చిత్తడే అన్నట్లుగా ఉన్నాయి. మండల కేంద్ర పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది. మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీలో 2011–12 ఆర్థిక సంవత్సరంలో ఎస్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.24 లక్షల నిధులను మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టడంతో నిర్మించిన మూణ్నాళ్లకే సీసీ రోడ్లు కొట్టుకుపోయాయి. పుష్కరకాలంగా ఆ కాలనీలో మళ్లీ సీసీ రోడ్లు వేయడానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో వర్షా కాలం వచ్చిందంటే కాలనీవాసులు జంకుతున్నారు. వర్షపు నీరు రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచి అలానే ఉంటోంది. దీంతో బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది తప్పడం లేదు. పలుమార్లు పాలకులు సైతం ఈ రోడ్డును సందర్శించి విచారం వ్యక్తం చేశారు. కాని ఇప్పటికీ సీసీ రోడ్డు ఏర్పాటు చేయలేదు. భవిష్యత్తులో చేస్తారనే నమ్మకం కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీ రోడ్డును కలుపుతూ ఎస్సీ వాడ వరకు తారు రోడ్డు వేయాలని గతంలో జీపీలో కూడా తీర్మానం చేసినట్లు తెలిసింది. కాని స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్ వార్ ఉండటంతో ఆ పని కూడా అటకెక్కింది. మండల కేంద్రంలోని కాలనీలో రోడ్ల దుస్థితి ఇలా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలోని ఎస్సీఆర్ కాలనీ, భైంసా గల్లీ అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పాలకులు స్పందించి వెంటనే అంతర్గత రోడ్లకు సీసీ రోడ్లు వేయించాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందిగా ఉంది



మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. సీసీ రోడ్లు వేసినా అవి కనిపించకుండా పోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. పాలకులు స్పందించి వెంటనే సీసీ రోడ్లు వేయించాలి.

– నర్సింగ్‌రావు, కాలనీవాసి, బాల్కొండ

నిరుపయోగంగా వాటర్ ఫౌంటెయిన్

- బురద, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్ పట్టణంలోని వాటర్ ఫౌంటెయిన్



ఫౌంటెయిన్‌లో పేరుకుపోయిన బురద

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో సుందరీకరణలో భాగంగా అంబేడ్కర్ చౌరస్తా వద్ద గత ప్రభుత్వం వాటర్ ఫౌంటెయిన్‌ను నిర్మించింది. అలాగే నవనాథ సిద్ధుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వాటి నిర్వహణ, పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. అధికారులు సైతం ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నా దాని వైపు కన్నెత్తి చూడడం లేదు. 13, 14వ ఆర్థిక సంఘం నిధులతో వాటర్ ఫౌంటెయిన్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఆ ఫౌంటెయిన్‌లో అంతా బురద, పిచ్చి మొక్కలు చేరి అధ్వానంగా తయారైంది. ఫౌంటెయిన్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కొత్తగా నిర్మించిన సమయంలో వాటర్ ఫౌంటెయిన్, నవనాథ సిద్ధుల ప్రతిమల వద్ద ప్రజలు ఆగి ఫోటోలు దిగే వారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సిద్ధుల ప్రతిమల్లో పగుళ్లు వచ్చాయి. మరికొన్ని వాటికి చేతులు విరిగిపోయి ఉన్నాయి.

మరమ్మతులు చేయిస్తాం



అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫౌంటెయిన్‌ను త్వరలోనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. నవనాథ సిద్ధుల విగ్రహాలకు కూడా మరమ్మతులు చేయిస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఇసుక సమస్య పరిష్కరించండి



నిరాహార దీక్ష చేపట్టిన జాన్కంపేట్ గ్రామస్తులు

- లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిష్కరిస్తామని అధికారుల హామీ
- ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్న జాన్కంపేట గ్రామస్తులు

వేల్పూర్: జాన్కంపేట్ గ్రామానికి పక్కనే ఉన్న పెద్ద వాగు నుంచి ఇసుక తీసుకునేందుకు పచ్చలనడ్కుడ గ్రామంతో ఉన్న సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ జాన్కంపేట గ్రామస్తులు సోమవారం నిరాహారదీక్ష చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇంటికొకరు చొప్పున నిరాహార దీక్షలో కూర్చున్నారు. నెలల తరబడి అధికారులు వారి చుట్టూ తిప్పుకుంటున్నారు తప్ప సమస్యను పరిష్కరించడంలేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అధికారులకు చాలా సార్లు విన్నవించామన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామస్తులంతా కలిసి ఆందోళన చేస్తే ఎన్నికల తర్వాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. తర్వాత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పక్కనే వాగు ఉన్నా ఇసుక తీసుకోలేని దైన్య స్థితిలో ఉన్నామన్నారు. చర్చల సమయంలో వాగు, ఇసుక ప్రభుత్వానిదని, దానిపై ప్రభుత్వానికే తప్ప గ్రామాల వారికి హక్కులు లేవని చెబుతూనే తమకు ఇసుక ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామడుగు ప్రాజెక్టు వద్ద మొదలైన పెద్దవాగుకు రెండు వైపులా ఉన్న గ్రామాలకు ఎటువంటి వెసులుబాటు ఉందో తమకు కూడా అటువంటి వెసులుబాటు కల్పించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్య పరిష్కరించేదాకా శాంతియుతంగా నిరాహారదీక్ష చేస్తామని పేర్కొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి సారూ..!



ఆచన్‌పల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి నుంచి పెగడాపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువల నిర్మాణం లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం రహదారిపై గల గుంతలను పూడ్చి, రోడ్డుపై మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బడాపహాడ్ హుండీ లెక్కింపు



లెక్కిస్తున్న వక్ఫ్ బోర్డు సిబ్బంది

వర్ని: ఉత్తర తెలంగాణలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన బడా పహాడ్ పుణ్యక్షేత్రం హుండీని సోమవారం వక్ఫ్ బోర్డు అధికారులు లెక్కించారు. బడా పహాడ్ టెండర్ ముగియడం, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలు కారణంగా రెండు నెలల పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు నిర్వహణ బాధ్యతలను స్థానిక వక్ఫ్ బోర్డు సిబ్బందికి అప్పజెప్పారు. దీంతో వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని ఆదేశాల మేరకు బడాపహాడ్ ఇన్‌ఛార్జి సద్దాం, సూపరింటెండెంట్ జమాల్ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య హుండీ లెక్కింపు కొనసాగుతోంది. మొత్తం నాలుగు హుండీల్లో భక్తులు వేసిన నగదు, వెండి, బంగారం, చిల్లర డబ్బుల కానుకలను వేర్వేరుగా లెక్కిస్తున్నారు. మొదటి హుండీ లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉండగా మిగతా హుండీల లెక్కింపు మంగళవారం రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని వక్ఫ్ బోర్డు సిబ్బంది తెలిపారు. హుండీ లెక్కింపు పూర్తయిన అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డు సిబ్బందికి అప్పజెప్పనున్నట్లు సూపరింటెండెంట్ జమాల్ తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

బోధన్: బోధన్ రైల్వే స్టేషన్‌కు నడిపించి రద్దు చేసిన రెండు ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునరుద్ధరించి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు రైలు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం రాకాసిపేట్ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు విద్యార్థి సంఘం జేఏసీ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. జేఏసీ ప్రతినిధి శివకుమార్ మాట్లాడుతూ.. బోధన్– మహబూబ్‌నగర్, బోధన్–కరీంనగర్ డెమో రైలు రద్దు చేసి మూడు నెలలు గడిచిపోయినా పునరుద్ధరించలేదని తెలిపారు. ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరించే వరకు నిజామాబాద్– కాచిగూడ మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును బోధన్ వరకు పొడగించాలని రైల్వే శాఖ అధికారులను కోరారు.

డీవీకే స్థూపం పోస్టర్ల ఆవిష్కరణ



నవీపేటలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు



నందిపేటలో.. సీపీఐ ఎంఎల్ నాయకులు


నవీపేట: ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కామ్రేడ్ డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణను జయప్రదం చేయాలని ప్రచురించిన వాల్ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్ మాట్లాడారు.కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సాయినాథ్, రాజేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం డీవీకే స్థూపం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపంక్తి జిల్లా నాయకులు కే గంగాధర్ మాట్లాడారు. రైతు కూలీలు, విద్యార్థులు, మేధావులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేవన్న, రాజలింగం, గుంజలి గంగాధర్, ఉమ్మడి గంగారం జువ్వన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

భీమ్‌గల్: డీవీ కృష్ణ స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మెండోరా గ్రామంలో జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏరకు రైతులకు పోడు పట్టాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి



రుద్రూర్: దివ్యాంగుల సమస్యల సాధనకై ఈ నెల 25న నిర్వహించనున్న చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు జల్లాపురం సాయిలు , కార్యదర్శి మోహన్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. పెంచిన పింఛన్‌లను ఇవ్వాలని, ఇతర డిమాండ్ల సాధనకు నిర్వహించే కార్యాచరణ సమావేశానికి వెళ్లడానికి రుద్రూర్ మండల కేంద్రం నుంచి ఉదయం 9 గంటలకు వాహనం బయలుదేరుతుందని చెప్పారు.

మండల మహిళా సమాఖ్య పాలక వర్గ సమావేశం

బోధన్ రూరల్ (బోధన్): పట్టణ కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో సోమవారం మండల మహిళ సమాఖ్య పాలక వర్గ సమావేశం పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. మండల ఏపీఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మహిళలందరూ సంఘాల్లో ఉండాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో బ్యాంక్ లింకేజీ రుణాలు 619 సంఘాలకు ఇవ్వాలని టార్గెట్‌లో భాగంగా ఇప్పటి వరకు 144 సంఘాలకు రుణాలు ఇప్పించారని తెలిపారు. జులైలో గ్రామ మహిళా సంఘాల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు. ఐకేపీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని కమలాకర్ నెహ్రూకాలనీలో సోమవారం దండోరా రజతోత్సవాల కరపత్రాలను ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి, అవార్డు గ్రహీత మోతే భూమన్న, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవన్నలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు హైదరాబాద్‌లో నిర్వహించే దండోరా రజతోత్సవాలకు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ దండోరా రజోత్సవాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. నాయకులు కందుల రాములు, ఎల్లయ్య ప్రభాకర్, మార్క్, జాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు



బోధన్ రూరల్(బోధన్): పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ బోధనపై టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. సీడీపీవో జానకి, అర్బన్ సూపర్‌వైజర్ రాధిక రాథోడ్, ట్రైనర్స్ పాల్గొని ప్రీస్కూల్ పాఠ్య పుస్తకాలను అంగన్‌వాడీ టీచర్లకు అందించారు. మరో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – హరోంహర (తెలుగు) – 12.00, 6.30; మనమే (తెలుగు)–3.15, 9.45; ఓ ఫైగాడ్ (తెలుగు) – 9.45

స్క్రీన్-2 – మహారాజ (తెలుగు) – 12.45, 3.50, 6.55, 10.00

స్క్రీన్-3 – ఓఫైగాడ్ (తెలుగు) – 1.20, 6.45; నింద(తెలుగు)– 4.05, 9.30

స్క్రీన్-4 – ఓ ఫైగాడ్ (తెలుగు) – 11.55, 3.10; ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు) – 6.25, మరణం(తెలుగు)– 9.15

సంక్షిప్తం

అర్గుల్ రాజారాం జయంతి వేడుకలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద మాజీ మంత్రి అర్గుల్ రాజారాం 100వ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, లోక భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్, బ్లీచింగ్ పౌడర్ పంపిణీ

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో క్రిభ్‌కో ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయాలు, దేవాలయాలకు డస్ట్ బిన్, బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేశారు. కంపెనీ సామాజిక సేవలు, పరిసరాల పరిశుభ్రత ప్రచారంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. సొసైటీ చైర్మన్ దేవేందర్, కంపెనీ ఏరియా మేనేజర్ శ్రీనివాస రావు, సేల్స్ ఆఫీసర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఏఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

రుద్రూర్: రుద్రూర్ గ్రామ శివారులోని పుట్ట ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గంగుల గంగాధర్, తోట్ల కిరణ్, బర్ల శంకర్, తోట నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయాన్ని సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పల్లకీసేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, హజారి సతీష్, కొంతం మంజులా మురళి పాల్గొన్నారు.

తూము మరమ్మతులకు తేల రవి యువసేన చేయూత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువు తూము మరమ్మతులకు నోచుకోక సైడ్ వాల్ దుస్థితి అధ్వానంగా మారింది. దీంతో సాగు నీరు వృథాగా పోతోందని మరమ్మతులు చేపట్టాలని శివారు రైతులు స్థానిక తహసీల్, బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఎలాంటి ఫలితం లేనందున రైతుల కోరిక మేరకు తేల రవి యువసేన ఆధ్వర్యంలో మరమ్మతు పనులను చేపట్టారు. మరమ్మతులకు కావాల్సిన ఇసుక, కంకరతో పాటు మెటీరియల్ అందించి పనులు పూర్తి చేయించారు. యువసేన నిర్వాహకులు రవికుమార్‌కు, ఆయన బృందానికి రైతులు ధన్యవాదాలు తెలిపారు

28న దొంకేశ్వర్ వారసంత వేలం పాట

దొంకేశ్వర్(ఆర్మూర్): 2024–25 సంవత్సరానికి దొంకేశ్వర్ వారసంత వేలం పాటను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శేఖర్ గౌడ్ సోమవారం తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.10వేలు డిపాజిట్ చేయాలని, గతంలో బకాయిలున్న వారు వేలం పాటకు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు పంచాయతీ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

గాదెపల్లి రమేశ్‌కు నివాళులర్పించిన సునీల్‌కుమార్



వేల్పూర్: వేల్పూర్ మండలం పోచంపల్లి వద్ద కారు అదుపు తప్పి నీటిలో పడి మరణించిన పడగల్‌కు చెందిన గాదేపల్లి రమేశ్ మృతదేహానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం సాయంత్రం నివాళులర్పించారు. ఘటన ఏ విధంగా జరిగిందీ తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

వేల్పూర్: పడగల్ గ్రామానికి చెందిన రైతు, బీజేపీ నేత గాదేపల్లి రమేశ్ ప్రమాదవశాత్తు పోచంపల్లి వద్ద కారు నీటిలో పడి మరణించడంతో సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ హాజరయ్యారు. ఆమెతో పాటు కుమారుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి హాజరై రమేశ్‌కు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.